



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

10 మంది నామినేషన్ల తిరస్కరణ

- 32మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 26: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి దాఖలైన నామినేషన్లను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య శుక్రవారం స్క్రూటినీ జరిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాధారణ పరిశీలకులు ఎలీస్‌వజ్‌అర్ సమక్షంలో అభ్యర్థులు, వారి ప్రతినిధుల ముందర రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా పది మంది అభ్యర్థులు సమర్పించిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యాయి. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి 42మంది అభ్యర్థులు 90నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినిలో పది మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించబడ్డాయి. 32మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయి. అఫిడవిట్ సమర్పించకపోవడం, సక్రమంగ లేకపోవడం, నామినేషన్ల పత్రాలపై సంతకాలు చేయకపోవడం, ప్రతిపాదకుల వివరాలు పొందుపర్చకపోవడం వంటి కారణాల వల్ల పది నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ మేరకు ఒక్కో అభ్యర్థి వారిగా వారి నామినేషన్లను వారి సమక్షంలోనే పరిశీలిస్తూ తిరస్కరణకు గురైన నామినేషన్లు ఎందుకు తిరస్కరించబడ్డాయన్న విషయాలను స్వయంగా రిటర్నింగ్ అధికారి అభ్యర్థులకు తెలియజేశారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో మిర్యాల్‌కర్ జయప్రకాష్, పోతు అశోక్, మహ్మద్ జమీల్, ఎండి షాహెద్‌ఖాన్, కొండూరు గంగాధర్, పానిగంటి రజితవాణి, చెంచుల అశోక్, బేగరిపోశం, మీసాల శ్రీనివాస్‌రావ్, వి.మహతేజులు ఉన్నారు. ఈ ప్రక్రియలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.



స్క్రూటినీలో పాల్గొన్న అధికారులు



జిల్లాలో సన్నాల జోష్

- జిల్లాలో సన్నరకం ధాన్యానికి వ్యాపారులు, మిల్లర్ల మొగ్గు
- డిమాండ్ పెరగడంతో భారీగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు సేకరిస్తున్న ధాన్యం
- ఇప్పటి వరకు రూ.596కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ.319 కోట్లు జమచేసిన అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వ్యాపారులు సన్నరకం ధాన్యానికే మొగ్గుచూపుతున్నారు. ఎక్కువ మొత్తంలో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. బియ్యానికి భారీగా డిమాండ్ పెరుగుతుండడంతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ నిల్వ ఉంచుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం వస్తుండడంతో కష్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని మిల్లులపై నజర్ పెట్టడంతో ధాన్యం మళ్లింపు కన్నా రైతుల నుంచి కొనుగోలు చేసి బియ్యం అమ్మకం చేసేందుకే ఎక్కువ మంది వ్యాపారులు ముందుకు వస్తున్నారు. సన్నాలు పండించిన రైతుల నుంచి ఈ ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా భారీ ఎత్తున సేకరిస్తున్నారు.

సన్నరకం బియ్యానికి భారీగా డిమాండ్

యాసంగి సన్నరకం ధాన్యానికి డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకముందు వ్యాపారులు సిండికేట్ అయి ధరను తగ్గించారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసినా క్వింటా రూ.1900 నుంచి రూ.2100 మధ్యనే కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాగానే వ్యాపారులు కూడా ధరలను పెంచుతూ కొనుగోలు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా సన్నరకం బియ్యానికే భారీగా డిమాండ్ పెరుగుతోంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6వేల నుంచి 7వేల మధ్యన ధర వస్తుండడంతో వ్యాపారులతో పాటు మిల్లర్లు కూడా ఎక్కువ మొత్తంలో ఈ ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లా వ్యాపారులతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చి సన్నరకం ధాన్యాన్ని కొంటున్నారు. యాసంగిలో 60 శాతానికిపైగా రైతులు సన్నరకాలనే ఎక్కువగా సాగుచేశారు. గంగ కావేరి, బీపీటీ, ఎచ్ఎంటీ, జైశ్రీరాంతోపాటు ఇతర సన్నరకాలను సాగుచేశారు. పెద్ద రైతులతో పాటు చిన్న రైతులు కూడా ఈ సన్నాలను వేశారు. బోధన్ డివిజన్ పరిధిలో ఎక్కువ మొత్తంలో సన్నరకాలు ధాన్యం ను సాగుచేయగా మెజార్టీ రైతుల నుంచి వ్యాపారులే ఎక్కువగా కొనుగోళ్లను చేశారు. మొదట ధర తగ్గించినా ప్రస్తుతం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలు రూ.2200 నుంచి రూ.2300 వరకు కొంటున్నారు. కొన్నిచోట్ల క్వింటాలు రూ.2100 నుంచి రూ.2200 వరకు కొనుగోలు చేస్తున్నారు.


పోటాపోటీగా వ్యాపారుల కొనుగోలు

రాష్ట్రంలో సన్నరకం ధాన్యం ఎక్కువగా జిల్లా రైతులే పండించారు. బియ్యం వినియోగం ఎక్కువగా ఉండడం ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేసి అమ్ముకునే అవకాశం ఉండడంతో వ్యాపారులు పోటీ పడీ కొనుగోలు చేస్తున్నారు. బియ్యాన్ని మార్కెట్‌లో అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. క్వింటాలు సన్నరకం ధాన్యానికి 67 నుంచి 68 కిలోల వరకు బియ్యం వచ్చే అవకాశం ఉండడంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొని బియ్యం అమ్మడం వల్ల లాభాలు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోనే మిల్లర్లు కూడా కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తూ ధాన్యాన్ని నిల్వ చేసు కుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మిల్లర్లు ఎక్కువ మంది ముందుకు వచ్చి ఈ సన్నరకాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని కూడా మిల్లర్లు కేటాయింపులకు అనుగుణంగా తీసుకోవడంతో పాటు కష్టం మిల్లింగ్‌ను నిర్ణీత సమయంలో అందించేందుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం పక్కదారి పట్టగా పలు మిల్లుల పైన కేసులు కావడంతో అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు అధికారులు నిత్యం సమీక్షిస్తుండడంతో ఏరోజు కారోజు ధాన్యం తీసుకోవడంతో పాటు వానాకాలం ధాన్యానికి సంబంధించి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. సొంతంగా సన్నరకాలు కొనుగోలు చేసినా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని కూడా మిల్లింగ్ చేసేందుకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నారు.



480కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 480కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 417 కేంద్రాల నుంచి 2,70,683 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రతిరోజూ 10నుంచి 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 40వేల మంది రైతుల నుంచి 596కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతుల అమ్మకాలను బట్టి కొనుగోలు కేంద్రం ఇచ్చే ట్రక్‌షీట్ ఆధారంగా ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి అనుగుణంగా వారి ఖాతాల్లో డబ్బులను జమచేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,44,952 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 319 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశారు. ధాన్యం పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్న అధికారులు వెంట వెంటనే తరలింపునకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుల వరకు ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. మిల్లుల్లో కూడా వాహనాలు రోజుల తరబడి ఉండకుండా చూస్తూ వెంటనే అన్‌లోడ్ చేసి పంపించే విధంగా చూస్తున్నారు. కొనుగోలు చేసిన దాన్యాన్ని ఏరోజు కారోజు షిఫ్టింగ్ చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. హమాలీలు గన్నీబ్యాగ్‌ల కొరత లేకుండా చూస్తూనే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాష్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్ తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనుగోళ్లను పూర్తిచేస్తామని వారు తెలిపారు.



పోటాపోటీ!

- ప్రచార హోరు పెంచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు
- గట్టి పోటీని ఎదుర్కొంటున్న ముగ్గురు అభ్యర్థులు
- గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న పార్టీ నేతలు

నిజామాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రచారం జోరందుకుంది. పోటాపోటీగా నేతలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య పోటీ కొనసాగగా, ఈ ఎన్నికల్లో మాత్రం ముక్కోణపు పోటీ కొనసాగుతోంది. ప్రధాన పార్టీల తరపున రాష్ట్ర, జాతీయ నేతలు ప్రచారాల్లో పాల్గొంటున్నా.. ఓటర్లు మాత్రం ఎటువైపు మొగ్గు చూపుతున్నారో అంచనాకు రావడం లేదు. తమ పార్టీల ఆధ్వ ర్యంలో ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాలే ఎజెం డాగా ప్రచారం కొనసాగిస్తున్నారు. సొంతపార్టీ నేతలతో పాటు ఇతర పార్టీ నేతలను కలుపుకుని ఎలాగైనా గెలిచేందుకు ముగ్గు రు అభ్యర్థులు సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ఉన్న పదిహేను రోజుల్లో పూర్తిస్థాయిలో ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్లమెంట్ పరిధిలో 17,01,573 మంది ఓటర్లు

పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 17,01,573మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 8,04568 ఉండగా, మహిళ ఓటర్లు 8,96,915 మంది ఉన్నారు. వీరితో పాటు ఇతరులు 90మంది ఉన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ప్రతిసారి ఎన్నికల్లో 60నుంచి 70శాతం మధ్యన పోలింగ్ జరుగుతుంది. శాసనసభ ఎన్నికలకు 80 నుంచి ఆపైన 85 శాతం వరకు జరుగుతుండగా పార్లమెంట్‌కు మాత్రం తక్కువగా పోలింగ్ అవుతుంది. పార్లమెంట్ పరిధిలోని బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా, బోధన్, నిజామాబాద్ రూరల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీకి మొత్తం 3,65,374 ఓటర్లు పోలయ్యాయి. కాంగ్రెస్‌కు 4,08,135 ఓటర్లు పోలవగా, బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 4,17,315ఓట్లు పోలయ్యాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు నామమాత్రం ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ తరఫున 2019లో మధుయాష్కీ గౌడ్ పోటీ చేయగా ఆయనకు కేవలం 69,240 ఓట్లు మాత్రమే వచ్చాయి. టీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితకు 4,09,709ఓట్లు పోలవగా, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు 4,80,584 ఓట్లు పోలయ్యాయి. ఆయనే పార్లమెంట్ అభ్యర్థిగా ఆ ఎన్నికల్లో గెలుపొందారు. ఈ పార్లమెంట్‌కు అధికార పార్టీ కాంగ్రెస్ తరఫున టి.జీవన్ రెడ్డి పోటీ చేస్తుండగా బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రెండోదఫా పోటీ పడుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ చేస్తున్నారు. ముగ్గురు బలమైన ప్రత్యర్థులే. వీరికి బలమైన అనుచర వర్గం ఉండగా అదే విధంగా పార్టీ కేడర్ కూడా ఉంది. తమ పార్టీ వారే కాకుం డా ఇతర పార్టీవారితో ముగ్గురికి మంచి సంబంధాలే ఉన్నాయి. ముగ్గురు నేతలకు వివిధ సంఘాల మద్దతులు ఉంది. వీటన్నింటికంటే మించి మూడు పార్టీలకు పార్లమెంట్ పరిధిలో బలమైన ఓటుబ్యాంకు ఉంది.

శాసనసభ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు ఓటమి

గత శాసనసభ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు కూడా పోటీ చేసి ఓడిపోయారు. ఆ సానుభూతి కూడా ముగ్గురిపై ఉంది. గత పార్లమెంట్ ఎన్నికల పరిస్థితులు ప్రస్తుతం ఈ ఎన్నికల్లో కనిపించడం లేదు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితపై పూర్తి వ్యతిరేకత కనిపించింది. పసుపు బోర్డు తీసుకురాలేదని ఏకంగా రైతులే 180మంది వరకు ఆమెపై పోటీ పడ్డారు. సీఎం కూతురైనా ఆ ఎన్నికల్లో రైతులు పట్టుబట్టి ఓడించారు. బీజేపీకి పట్టం గట్టారు. ఈ ఎన్నికల్లో ప్రస్తుతం అంత వ్యతిరేకత కనిపించడం లేదు. ముగ్గురు అభ్యర్థులు అసెంబ్లీలో ఓడినా ఈదఫా పార్లమెంట్‌కు వెళ్లేందుకు గట్టిపోటీని ఇస్తున్నారు. ముగ్గురు కూడా ఈ ఎన్నికల్లో ఓటర్ల నుంచి మద్దతునే కూడగట్టుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి సుదీర్ఘకాలం రాజకీయంలో ఉన్నా ఆయనకు కూడా కొంత ఇబ్బందే కొనసాగుతుంది. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత పూర్తి స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం కదులుతున్నా ఇంకా గెలుపు పైన పూర్తి స్పష్టత కనిపించడం లేదు. ప్రజల్లో శాసనసభ ఎన్నికల్లో కనిపించిన వైఖరి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో లేకపోవడం వల్ల కొంతమేర ఇబ్బంది పడుతున్నారు. భారీ ఎత్తున ఇతర పార్టీల నుంచి నేతలు చేరినా వారి నుంచి ఓటు ఎంతవరకు కాంగ్రెస్‌కు మల్లుతుందోనని అంచనాకు రాలేకపోతున్నారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ కూడా గత పార్లమెంట్ ఎన్నికల పరిస్థితి లేదు. ప్రజల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల పైన అంత వ్యతిరేకత కనిపించడం లేదు. గత ఎన్నికల కంటే ఎక్కువ మొత్తంలో ఆయన పార్టీ నేతలు కష్టపడుతున్నా ఇద్దరు బలమైన అభ్యర్థులే కావడం వల్ల ఎక్కువ మొత్తంలో ప్రచారం కొనసాగించవలసి వస్తుంది. పసుపు బోర్డు ఆయనకు అనుకూలంగా పనిచేస్తున్నా ఇద్దరు బలమైన వ్యక్తులే ఉండడం వల్ల పూర్తిస్థాయి అంచనాకు రాలేకపోతున్నారు. ఎక్కువ మొత్తంలో క్యాడర్‌తో పాటు వివిధ సంఘాలను రంగంలోకి దించే డోర్‌టు డోర్ క్యాంపెయిన్ కొనసాగిస్తున్నారు. అయోధ్య అంశంతోపాటు మోదీ మానియా పనిచేసి బయట పడతామని అంచనాకు బీజేపీ నేతలు వస్తున్నారు. ఎలాగైనా రెండో దఫా సిట్టింగ్ స్థానాన్ని నిల బెట్టుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. బీఆర్‌ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ చేస్తుండగా పార్టీకి బలమైన ఓటు బ్యాంకే పార్లమెంట్ పరిధిలో ఉంది. శాసనసభ ఎన్నికల్లో కూడా ఈ పార్టీకే ఎక్కువగా ఓట్లు వచ్చాయి. శాసనసభ ఎన్నికలకు భిన్నమైనవి పార్లమెంట్ ఎన్నికలు కావడంతో బీఆర్‌ఎస్ నేతలు కూడా గట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఉన్న ఓటు బ్యాంకును నిలుపుకునేందుకు తిప్పలు పడుతున్నారు. పార్టీ నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్తున్నా క్యాడర్ తమవెంటే ఉండడం బలమైన ఓటుబ్యాంకు ఉండడంతో ప్రచారంలో చొచ్చుకుపోతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో కొనసాగిస్తున్నారు. ప్రస్తుత ప్రచారాల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నా ఎవరికి మాత్రం ఓటరు నాడీ అర్థం కావడం లేదు.



మూలములుపు వద్ద బోల్తాపడిన వ్యాన్

డీసీఎం బోల్తా

- మల్లారం అటవీ ప్రాంతంలో బోల్తాపడ్డ డీసీఎం వ్యాన్
- ఇద్దరి మృతి, పలువురికి గాయాలు
- బడాపహడ్‌కు వెళ్తుండగా ఘటన
- కమ్మర్‌పల్లిలో విషాదఛాయలు
- క్షతగ్రాతులను పరామర్శించిన ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు



శ్యామ్‌సుందర్ (ఫైల్)



వసంత (ఫైల్)

నిజామాబాద్ రూరల్/కమ్మర్‌పల్లి ఏప్రిల్, 26: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా 14మందికి గాయాలపాలయ్యారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా మారడంతో చికిత్సకోసం ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లి మండలానికి చెందిన రెంజర్ల స్వామి తన కుమారుడు నిర్విన్‌కు ఆరేళ్లు పూర్తవడంతో బడాపహడ్‌లో కందూరు (పండుగ) చేసుకుంటానని మొక్కుకున్నాడు. దీంతో మొక్కు తీర్చుకునేందుకు ఈ నెల 25న గురువారం రాత్రి కమ్మర్‌పల్లి నుంచి డీసీఎం వాహనంలో 36 మందితో వర్ని మండలంలోని బడాపహడ్‌కు బయల్దేరారు. అర్ధరాత్రి 11 గంటలు దాటిన తర్వాత డీసీఎం వాహనం నిజామాబాద్ నగరం దాటి రూరల్ మండల పరిధిలోని మల్లారం రిజర్వు ఫారెస్టులోని దట్టమైన అడవీ గుండా ప్రయాణించింది. అయితే ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద డీసీఎం వాహనం డ్రైవర్ వాహనాన్ని అదుపుచేయ లేక రోడ్డుపక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దాంతో డ్రైవర్ పక్కనున్న రెంజర్ల శ్యాంసుందర్ (32), డీసీఎం వాహనం అంచు వద్ద కూర్చున్న రెంజర్ల వసంత (30) అనే మహిళకు తీవ్రగాయలై అక్కడే మృత్యువాత పడ్డారు. వాహనంలోని మిగతా వారిలో చాలమందికి తలకు, చేతులకు, ముఖం, నడుం ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్పగాయాలతో బయటపడ్డారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి చైతన్య రెడ్డి విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108లో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పలువురి పరామర్శ..

ఘటన సమాచారం తెలుసుకున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అర్ధరాత్రి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని, అత్యవసర చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. శుక్రవారం ఉదయం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ గుప్త, ఎంపీ ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నవారిని పరామర్శించి వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు. మృతిచెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కాగా, కమ్మర్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్‌వజ్‌ఆర్ సమక్షంలో పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీహన్మంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకులు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. పార్లమెంటు సెగ్మెంట్ లోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రేనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని, మే 1, 2 తేదీల్లో రెండవ విడత శిక్షణకు ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాలకు కెటాయించిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారన్నారు. ఈసందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఈ ప్రక్రియలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, ఆర్డీవో రాజగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

● మండల ప్రత్యేక అధికారిణి సుష్మ


భిక్కనూరు, ఏప్రిల్ 26: మండలంలోని బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి సుష్మ అన్నారు. శుక్రవారం బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి మాట్లాడుతూ బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2లక్షల అంచనాతో పైప్‌లైన్ వేయ్యడం జరుగుతుందన్నారు. మండలంలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో రాధిక, గ్రామపంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం


● రాజంపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశం

'ఎండలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలి'

రాజంపేట, ఏప్రిల్ 26: మండలకేంద్రంతో పాటుగా శేర్‌శంకర్ తండా గ్రామాలలో శుక్రవారం ఉపాధి పనులను ఎంపీడీవో రాజేశం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున్న కూలీలు జాగ్రత్తలు పాటించాలని, ఉదయం 6:30 గంటల నుంచి 10:30 గంటల వరకు పనులు కొనసాగించాలని సూచించారు. ఇందులో టీఏ బాస్కర్, పంచాయితీ కార్యదర్శి అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.
















విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

పోటీ పరీక్షల్లో పాల్గొని సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి: సీఐ

సిరికొండ, ఏప్రిల్ 26: పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలో పాల్గొని ప్రతిభ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని ధర్పల్లి సీఐ భిక్షపతి విద్యార్థులకు సూచించారు. అకాడమీ, ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్టు-2023 ఒలంపియాడ్‌లో పాల్గొని రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచిన దీక్షిత్, కృతిక, అద్వైత్‌రెడ్డి, విష్ణు, రిషిత్‌లను సీఐ అభినందించి మెమొంటోలను అందజేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువడంతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. విద్యార్థులవెంట ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి ఉన్నారు.

ఎంఎల్‌బీ కప్ బేస్‌బాల్ క్రీడాపోటీల్లో చీమన్‌పల్లి విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఏప్రిల్ 26: అంతర్‌రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎంఎల్‌బీ కప్ బేస్‌బాల్ క్రీడాపోటీల్లో సిరికొండలోని చీమన్‌పల్లి హైస్కూల్ విద్యార్థుల ద్వితీయస్థానంలో నిలిచారు. ఈనెల 23 నుంచి రెండు రోజులపాటు ఉస్మానియా యూనివర్సిటీ క్రీడామైదానంలో హైదరాబాద్ (తెలంగాణ-ఆంధ్రప్రదేశ్) రీజియన్ 12వ చాంపియన్‌షిప్ ఎంఎల్‌బీ కప్ ఫైనల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీమన్‌పల్లి జట్టు సిరికొండ సత్యశోధక్ జట్టుతో తలపడి రెండోస్థానంలో నిలిచింది. ద్వితీయ బహుమతిని అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సాఫ్ట్‌బాల్ ఇండియా కోచ్ డాక్టర్ కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ పరీక్షలు 4వ రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 1వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 355 పరీక్షలకు హాజరుకావాల్సిన 331 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

రుద్రూరు, ఏప్రిల్26: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్‌లను అమర్చుకోవాలని రుద్రూరు ఎస్సై అప్పారావు తెలిపారు. శుక్రవారం రుద్రూరులో వాహనాలను తనిఖీ నిర్వహించి నెంబర్ ప్లేట్‌లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి అమ్మేవారు, తాగే వారి గురించి తెలిసిన వెంటనే సమాచారం అందించాలని ఎస్సై కోరారు. వివరాలు తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఆధారాలున్నా.. నగదు స్వాధీనం!

● సామాన్యులకే కోడ్ కష్టాలు ● ఎన్నికల వేళ భారీగా పట్టుబడుతున్న నగదు, బంగారం ● పట్టుబడుతున్న డబ్బంతా సామాన్యులదే! ● టార్గెట్ల కోసం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అత్యుత్సాహం
● ఆధారాలున్నా వదలని వైనం ● తమ నగదు కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు ● నిజనిర్ధారణ కమిటీ పరిశీలన తర్వాతే చేతికి..

ఖిల్లా, ఏప్రిల్ 26: ఎన్నికలలో ప్రలోభాలకు తావివ్వకుండా.. నగదు, బంగారం రవాణాను అడ్డుకట్ట వేసి.. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటుచేస్తున్న చెక్‌పోస్టులు, తనిఖీ కేంద్రాల్లో సామాన్యుల నగదు, బంగారుఆభరణాలు స్వాధీనం చేసుకుంటున్నారు. 50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తున్న నగదును గుర్తించిన డబ్బును స్వాధీనం చేసుకుంటున్నారు. వాటికి ఆధారాలు చూపినా సరైన ఆధారాలు లేవంటూ స్వాధీనం చేసుకున్న నగదును ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపించేస్తున్నారు. తమ నగదు కోసం బాధితులు కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అనేక అవస్థలు పడుతున్నారు.

● టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అత్యుత్సాహం

పట్టుబడిన నగదు, ఆభరణాలకు తగు ఆధారాలు చూపిన వారికి ఆ డబ్బును అక్కడే ఇచ్చేయాలని కలెక్టర్ పోలీసులకు ఆదేశాలు జారీచేసినా పోలీసుశాఖలో ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మాత్రం తమ టార్గెట్ల కోసం ఒక అడుగు ముందుకేసి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలోని పలు బ్యాంకుల వద్ద మాటు వేసి అమాయకంగా కనిపించిన వారిని గుర్తించి వారి వాహనాలను తనిఖీ చేసి డబ్బు కనిపించగానే స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ డబ్బుకు సంబంధించిన బ్యాంకు వారు ఇచ్చిన లెటర్ చూపిన ససెమిరా అంటూ వారిని బెదిరించి మరీ పోలీసులకు అప్పగిస్తున్నారు. రెండురోజులుగా జిల్లావ్యాప్తంగా మొత్తం 17మంది వద్ద డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారుల వద్ద రికార్డులు ఉన్నాయి. అయితే వీరు పట్టుకున్న నగదు అంతా సామాన్య ప్రజానీకం ఉండడం గమనార్హం. తాను ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకు నుంచి డ్రా చేసిన



రూ.3లక్షలకు సదరు వ్యక్తి ఆధారాలు చూపినా పోలీసులు మాత్రం వినిపించుకోక ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గత గురువారం నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌కు చెందిన కమీషన్ ఏజెంట్ రూ.9లక్షల 90వేలను బ్యాంకు నుంచి డ్రా చేసుకుని తన ద్విచక్రవాహనంలో పెట్టుకుంటుంటే అక్కడే మాటు వేసి ఉన్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆయన వద్దనుంచి ఆ డబ్బును స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఆ డబ్బుకు సదరు వ్యక్తి ఆధారాలు చూపినా ఇవ్వకుండా అధికారులకు ముట్టచెప్పాడు. దీంతో సదరు కమీషన్ ఏజెంట్ రైతులకు చెల్లించాల్సిన డబ్బు కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని ఆధారాలు చూపినా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఉండడంతో ఆ వ్యక్తి ఆ నగదు కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● త్రిసభ్య కమిటీ పరిశీలించిన తర్వాతే..

పోలీసులు పట్టుకుని జిల్లా ఖజానా కార్యాలయంలో జమ చేసిన డబ్బులకు ఆధారాలు చూపినా సకాలంలో రావడంలేదు. ఆ డబ్బు పొందాలంటే ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ పరిశీలించిన అనంతరం డబ్బు పొందడానికి అవకాశం ఉంటుంది. అయితే ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులే కమిటీ సభ్యులుగా ఉండడంతో వారు సకాలంలో రావడం లేదని, వచ్చినా అన్నీ పరిశీలించి డబ్బు ఇవ్వడానికి రెండు నుంచి మూడు రోజులు పడ్తుందని బాధితులు తెలిపారు.

● ఎన్నికల డబ్బును పట్టుకోని పోలీసులు

ఎన్నికలలో ప్రలోభాల కోసం కొందరు నాయకులు వెచ్చిస్తున్న డబ్బును మాత్రం పోలీసులు ముట్టుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందస్తుగానే వారికి సమాచారం ఉండడంతో వారు నాయకుల వాహనాలను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల టార్గెట్ కోసమే వారు సామాన్యుల డబ్బును పట్టుకుంటున్నట్లు తెలిసింది.

ఆధారాలుంటే నగదు ఇచ్చేయాలని సూచిస్తున్నాం..

● రాజవెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

పోలీసుల తనిఖీల్లో తమ సిబ్బంది పట్టుకున్న డబ్బులకు సరైన ఆధారాలు చూపించిన వారికి అక్కడే సంతకాలు, పూర్తి వివరాలు తీసుకొని డబ్బులు ఇచ్చేయాలని సూచిస్తున్నాం. అనవసరంగా ప్రజలకు ఇబ్బంది పెట్టొద్దనే ఆదేశిస్తున్నాం.



బోధన్‌లో శివనామ సప్తాహ దృశ్యం

దేశ సంస్కృతిని ప్రతీఒక్కరు ఆచరించాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: దేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలని బెట్‌మొగ్రా పీఠాధిపతులు శ్రీ బ్రహ్మసిద్ద దాయల్ శివాచార్య స్వామిజీ అన్నారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో శుక్రవారం 7వ రోజు శివనామ సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజల అనంతరం భక్తులు భజనలు, కీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని ఆయన సూచించారు. సృష్టిలో సమస్త జీవరాశుల్లో మానవ జన్మ చాలా శ్రేష్టమైనదని సూచించారు. ప్రజలు నిత్యం శివనామ స్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు అజయ్ వడియర్, పురాణే అజయ్ కుమార్, శంకరప్ప, విఠలప్ప, శివకుమార్, పురాణే దిలీప్ కుమార్, సిద్దిలింగాయప్ప, గణపతి అప్ప, నాగనాథ్ పటేల్, వీరశైవ భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం సెంటర్ ఫర్ వరల్డ్ సొలిడెరిటీ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని మందర్నా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌జీవోస్ స్వచ్ఛంధ సంస్థ పేద విద్యార్థుల భవిష్యత్ కోసం 4లక్షల విలువ గల డిజిటల్ మానిటర్ స్మార్ట్ టీవీని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సురేఖ, ఉపాధ్యాయులు శైలజ, గ్రామ పెద్దలు మందర్నా రవి, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

మోస్రా, ఏప్రిల్ 26: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో గల అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం జిల్లా జైలర్ రాజశేఖర్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తనవంతు సహాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనాథ వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతకుంట మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బస్టాండ్‌లో డ్రైనేజీ పనులు చేపడుతున్న దృశ్యం

ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 26: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. బస్టాండ్ లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన 'ఇదీ ఆర్టీసీ బస్టాండేనా?' కథనానికి ఆర్టీసీ మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. చాలా ఏళ్లుగా డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహించి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మురికి కాల్వ సైతం బస్టాండ్‌లోకి రావడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. దీంతో మున్సిపల్ అధికారులు మెయిన్‌రోడ్డు నుంచి బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్ గేట్ వరకు జేసీబీతో కాలువ తవ్వి డ్రైనేజీని నిర్మిస్తున్నారు.

బాల్కొండలో వ్యక్తిత్వ వికాస శిబిరం

ముప్కాల్, ఏప్రిల్26: బాల్కొండ మండల కేంద్రంలోని కిసాన్‌నగర్ గ్రామంలో భగవన్ శ్రీ సత్యనంద మహర్షి తీర్థ భక్తజన ఆశ్రమంలో మే 1నుంచి 7వ తేదీ వరకు ఎనిమిదేళ్ల నుంచి 15ఏళ్ల బాలబాలికకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ శిబిరం ఉంటుందని ఆశ్రమ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు భగవద్గీత, నిత్యప్రార్థన, శ్లోకాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. నైతిక విలువలు కూడిన కథనాలు, ఆటపాటలతో పాటు పుణ్యక్షేత్ర దర్శనం చేయించనున్నట్లు తెలిపారు. వారంరోజులు ఆశ్రమంలోనే పరిశీలిస్తారని, ఆసక్తిగల తల్లిదండ్రులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకొని, ముందుగా వచ్చే వారికే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థి

కోటగిరి, ఏప్రిల్ 26: కోటగిరిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి వివేక్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మొబిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటగిరి కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థి జేఈఈలో మెయిన్స్ పూర్తిచేసి అడ్వాన్స్‌కు అర్హత సాధించాడని పేర్కొన్నారు. విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి తాగుతున్న యువకులు

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 26: భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామశివారులోని నిర్మానుష ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం గుట్టుచప్పుడు కాకుండా చెట్లపొదల్లో గంజాయి తాగుతున్న యువకులను భీమ్‌గల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు ఎస్సై హరిబాబు వెల్లడించారు.



బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్‌యాదగిరి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● టీయూ రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి రిజిస్ట్రార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకృష్ణ, టూటా అధ్యక్షుడు పున్నయ్య, కాంట్రాక్టు అధ్యాపకుడు దత్తహరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నేతా, ఎన్ఎస్‌యూఐ నాయకులు సాగర్, రాజేందర్,మహేశ్, శ్రీకాంత్, నవీన్, కృష్ణ కుమార్, రాజు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: ఈనెల 20న అర్ధరాత్రి బైకుపై ఇంటికి వెళ్తుండగా హైటెక్ వెంచర్ వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన నడిపల్లి తండాకు చెందిన బట్టు సతీశ్, బట్టు సురేశ్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో పరిస్థితి విషమించి బట్టు సతీశ్ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

'రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలి'



నవీపేట బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవీపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో రైతులకు సంబంధించిన రూ.2లక్షల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.2లక్షల రుణమాఫీతోపాటు ఎకరాకు రూ.15వేలచొప్పున రైతుబంధు ఇవ్వాలని, వరి పంటకు మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ప్రతీ బూత్ నుంచి కనీసం 10 మంది చొప్పున నవీపేట మండలం నుంచి 1200మంది సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగరావు, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, అల్లం రమేష్, సూరి బాబు, గంగాధర్, మొహిజ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో చండీయాగం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, లోక కల్యాణం కోసమే చండీయాగం, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయసాయి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాల ప్రాంగణంలో సహస్ర లింగార్చన, యజ్ఞం, చండీయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేసి 20ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఆర్ చక్రవర్తి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న పురోహితులు

ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్26: వేసవికాలం ముగిసేవరకు అన్నిగ్రామాల్లో ఉపాధిహామీ కూలీలందరికీ తప్పనిసరిగా పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి 15వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో వేసవికాలం ముగిసేవరకు ప్రతీఒక్కరికి ఉపాధిహామీ పనులు కల్పించాలని, ఈ వేసవికాలం అయినందున పనులు చేసే చోట టెంట్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వేసవికాలం అయినందున ఎక్కువ మంది కూలీలు పనికి వచ్చే విధంగా చూడాలన్నారు. అనంతరం ఈ ఏడాదిలో గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు వివిధ పనులు చేయగా ఈ సామాజిక తనిఖీ ప్రజా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

వేదికలో ఉపాధి హామీ అధికారులు గ్రామాల వారీగా వివరాలు చదివి వినిపించారు. వివిధ గ్రామాల్లో రోడ్ల నిర్మాణంలో హరితహారం చెట్లు తొలగించగా, వేసవికాలం మొక్కలు ఎండిపోయినందున వచ్చే వర్షాకాలంలో కొత్తగా మొక్కలు నాటాలని ఆయన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వివిధ గ్రామాల్లో కూలీలు ఉపాధి హామీ పనులు చేయగా వారి హాజరుపట్టిక సరిగ్గా పడలేదని వాటిని సరి చేయాలని సూచించారు. రానున్న హరితహరం కార్యక్రమంలో వర్షకాలంలో మొక్కలు నాటి లక్ష్యానిన దాటలని అన్నారు. సమావేశంలో డీపీవో నారాయణ, అప్డర్‌మెంట్ శ్రీనివాస్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎస్ఆర్‌పీ పాండు, ఏపీవో రవి, గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: నగరంలోని 17వ డివిజన్ అభయహస్తం కాలనీలోని పలువురు సభ్యులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, నగర అధ్యక్షుడు కేశవేణుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం ద్వారా సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆరుగ్యారంటీలను అమలు చేసిందన్నారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం నగరంలోని న్యాలకల్ రోడ్డులో గల మున్నూరుకాపు సంఘంలో ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఓలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులతో, ఇతర సంఘాల నేతలతో సమావేశమయ్యారు సాయంత్రం ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో నాయిబ్రహ్మణ సంఘ నాయకులతో, రాత్రి 8గంటలకు 34వ డివిజన్‌లో కార్నర్ మీటింగ్, శంకర్‌భవన్ పాఠశాల వెనుక భాగంలో స్థానికులతో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడుగుగంగాధర్, కవితరెడ్డి, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి: పీడీ


ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

డిచ్‌పల్లి, ఏప్రిల్26: ఉపాధిహామీ పనులను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడిన ప్రతీ కూలీకి రోజుకు రూ.200 నుంచి 300 వరకు కూలీ లభించే ఆస్కారం ఉందని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉపాధి కూలీల పనితీరును నర్సింగపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పీడీ పరిశీలించారు. గ్రామంలోని గుండ్ల చెరువులో ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కూలీ లు చేసిన పనులను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధిహామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్లకుండా తమ గ్రామాల్లోనే ఉపాధి పని చేసుకోవచ్చునని పీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, విజిలెన్స్ అధికారి నారాయణ, ఏపీవో సుధాకర్‌రెడ్డి, టీఏ అరుంధతి, ఎఫ్‌ఏలు, మేట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు


విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న గౌడ యువజనసంఘం సభ్యులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్26: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో గౌడకుస్తుల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక గౌడ సంఘం భవనం నుంచి దేవతా విగ్రహాలు జెండా ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో గౌడసంఘం సభ్యులు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● ఎడపల్లిలో రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

ఎడపల్లి, ఏప్రిల్26: ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాది కాలనీలో మహాలక్ష్మి మందిరం దగ్గర నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో కళ్యాణ మహోత్సవ వేడుకలను శుక్రవారం ఎడపల్లి గౌడ కులస్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ ఉత్సవాలను 5రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిరోజు గౌడ కులస్థుల ఇళ్లలో జోగు ఎత్తడంతో ప్రారంభమై ఏడు ఊర్ల జోగు ఎత్తడం, వేయి కండ్ల బోనం ఎత్తుట, ఏడంత్రాల బోనములు ఎత్తిన తర్వాత 30వ తేదీన రేణుకాఎల్లమ్మ కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని గౌడ కులస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి గౌడ కులస్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లమ్మ విగ్రహంతో ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్థులు

హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టాలి

● కుళ్లిపోయిన కూరగాయలు, నాసిరకం సామగ్రితో వంట చేస్తున్నారని విద్యార్థుల రాస్తారోకో


కుళ్లిన కూరగాయలతో ధర్నా చేస్తున్న విద్యార్థులు


విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: నగరంలోని నాందేవ్‌వాడలో గల ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళనకు దిగారు. కుళ్లిన కూరగాయలు, సిలిండర్, వంట సామగ్రితో శుక్రవారం ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమకు కుళ్లిపోయిన కూరగాయలు, నాసిరకం సామగ్రితో వంట చేస్తూ తమ ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాడని విద్యార్థులు రాస్తారోకో చేశారు. గత రెండేళ్లుగా ఇదే తంతూ కొనసాగుతుందని ఎంత చెప్పిన వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు విద్యార్థులను అరెస్ట్ చేశారు.

గ్రామాభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కలీం

రెంజల్, ఏప్రిల్ 26: గ్రామాభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి కలీం అన్నారు. శుక్రవారం మండలంలోని మొగులాల్ తండా గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు వేదికలు అవుతాయని పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్న ప్రతి సమస్యను తమ దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరు గ్రామాభివృద్ధికి సహకరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. వేసవిలో తాగునీటిని వృథా చేయకూడదని, ప్రతి ఒక్కరు నీటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిని, తాజా మాజీ సర్పంచ్ సునీత బాబు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ మధు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మురుగుకాల్వలోని చెత్తను తొలగిస్తున్న కార్మికులు

పలు వార్డుల్లో పారిశుధ్య పనులు

రుద్రూరు, ఏప్రిల్ 26: రుద్రూరులోని పలు వార్డుల్లో గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'పడకేసిన పారిశుధ్యం' అనే కథనానికి స్పందించిన అధికారులు స్పందించారు. పలు వార్డుల్లోని మురికికాల్వల్లో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు. మురికికాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ

ఎన్నికల నిబంధనలను అందరూ పాటించాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: ప్రజలు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహనదారులు తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు విరుద్ధంగా ఆధారాలు లేకుండా 50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రతీఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ కోలా నరేష్‌లతో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎం విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి'

పెద్దబజార్, ఏప్రిల్26: ఈనెల 28న జరిగే సీపీఎం విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో మతోన్మాది బీజేపిని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ అనుసరించాల్సిన విధానంపై చర్చించనున్నట్లు తెలిపారు.

కనీస సౌకర్యాలు లేని కళాశాలల్లో తనిఖీలు

● టీయూ పరిధిలో రెండో రోజూ కొనసాగిన డిగ్రీ, పీజీ కళాశాల్లో అధికారుల తనిఖీలు


డిగ్రీ కళాశాలలో తనిఖీ చేస్తున్న టీయూ ఆడిట్ సెల్ అధికారులు

డిచ్‌పల్లి, ఏప్రిల్26: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ పీజీ, డిగ్రీ కళాశాలలుల్లో రెండోరోజూ తనిఖీలు చేసినట్లు వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్, గిరిరాజ్ కళాశాల, నలంద, గౌతమి, ఉమెన్స్, ఎస్వీ, కేర్, వాగ్దేవి, ప్రగతి, జునైరా, టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, కళాశాలల్లో రెంరోరోజు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. కళాశాలల్లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు, క్రీడా మైదానం, పార్కింగ్ సదుపాయాలు, మౌలిక సదుపాయాలపై పరిశీలన జరిపినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 3ప్రభుత్వ పీజీ కళాశాలలు, 16 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 54 ప్రైవేట్ యూజీ కళాశాలలు, 12 ప్రైవేట్ పీజీ కళాశాలలు, ఒకటి ఎంసీఏ కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. యూజీసీ, ఉన్నత విద్యామండలి, విశ్వవిద్యాలయం నిర్ధేశించిన నియమ, నిబంధనలకు లోబడి తనిఖీలు నిర్వహిస్తున్నమన్నారు. తనిఖీల్లో తెలంగాణ విశ్వవిద్యాలయం ఆడిట్‌సెల్ అధికారులు జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ గోరీ, డీన్స్ రాంబాబు, అపర్ణ, ఆరతి, లావణ్య, మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు ఆంజనేయులు, కంప్యూటర్ సైన్స్ హెడ్ భ్రమంరాధిక, రమణచారి, నాగరాజు, ప్రసన్నశీల, పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


పెర్కిట్‌లో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ గజానన్

చెక్‌పోస్టును పరిశీలించిన తహసీల్దార్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్26: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం తహసీల్దార్ గజానన్ పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎడపల్లి, ఏప్రిల్ 26: ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామం నుంచి జానకంపేట వెళ్లే రహదారిపై ఒడ్డెరకాలనీ వద్ద శుక్రవారం బైకు అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బాసర గ్రామానికి చెందిన గూరప్ప లక్ష్మన్ జానకంపేట లక్ష్మీనర్సింహస్వామిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో తన బైకు నెంబరు టీఎస్16 ఈవీ 3450పై వస్తుండగా కుర్నాపల్లి ఒడ్డెరకాలనీ దగ్గరకు రాగానే బైకు అదుపు తప్పి క్రింద పడడంతో తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. స్థానికులు అంబులెన్సుకు సమాచారం అందించగా.. బోధన్‌కు చెందిన 108 సిబ్బంది క్షత గాత్రున్ని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

'మోదీ మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దు'

పెద్దబజార్, ఏప్రిల్ 26: నరేంద్రమోదీ మాటలు నమ్మి ప్రజలు, కార్మికులు, రైతులు మోసపోవద్దని తెలంగాణా ప్రగతిశీల హమాలి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో గల కార్యలయంలో 138వ మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో పదేళ్ల పదిఏళ్ల పాలనలో పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డు పడ్డారని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీసవేతనాలు కరువయ్యాయని అన్నారు. కోర్టు తీర్పులను పక్కన పెట్టి ఎన్నోపోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మికుల చట్టాలను నాలుగు కోడులుగా కుదించి కార్మికులను కట్టు బానిసలుగా చేసే కుట్ర చేసిందని అన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు రాజ్‌కుమార్, మల్లేష్, గంగాధర్, శంకర్‌రాజు, కనకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

మోపాల్, ఏప్రిల్ 26: భార్య చేతిలో భర్త హత్యకు గురైన ఘటన మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో కలకలం రేపింది. మోపాల్ పోలీసుస్టేషన్ పరిధిలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన లస్మాయి సాయిరెడ్డి (55)ని అతని భార్య రాధ శుక్రవారం తెల్లవారుజాము మోహంపై దిండుతో నొక్కి హత్య చేసిందని ఎస్సై గంగాధర్ తెలిపారు. గత కొన్నిరోజుల నుంచి వారి కుటుంబంలో తరుచూగొడవలు జరుగుతున్న ఈ నేపథ్యంలో భర్త వేధింపులను భరించలేక భార్య హత్య చేసినట్లు నేరాన్ని స్వయంగా భార్య ఒప్పుకుందని ఎస్సై తెలిపారు. ఈ ఘటన తెలుసుకున్న రూరల్ సీఐ సురేష్‌కుమార్, ఎస్సై గంగాధర్‌లు ఘటనాస్థలాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలను వారి కుటుంబసభ్యులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. సాయిరెడ్డి ప్రతీరోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడడం కాకుండా కుటుంబసభ్యుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడని తెలిపారు. సాయిరెడ్డికి ముగ్గురు ఆడపిల్లలని, ముగ్గురికీ పెళ్లి కాగా, పెద్దమ్మాయికి పదేళ్ల కితం పెళ్లై విడాకులు కావడంతో ఆమె ఇంటి వద్దే ఉంటోంది. పెద్ద కూతురు ఇంటి వద్ద ఉండడంతో తరుచూ ఆమె పట్ల, భార్యపట్ల దురుసుగా ప్రవర్తించేవాడని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న సాయిరెడ్డిని నిద్ర లోనే దిండుతో ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

మోపాల్, ఏప్రిల్ 26: నీటి బకెట్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మోపాల్ మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన స్వరూపకు కోటగిరి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన గంగాధర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. గత రెండు రోజుల క్రితం తల్లిగారి స్వగ్రామమైన చిన్నాపూర్‌కు కూతుళ్లతో కలిసి స్వరూప ఇంటికి వచ్చింది. శుక్రవారంరాత్రి ఆడుకుంటున్న 18 నెలల చిన్నారి స్నేహిత ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడి మృతిచెందింది. ఆలస్యంగా చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

వర్ని తహసీల్దార్‌గా సాయిలు

వర్ని, ఏప్రిల్ 26: వర్ని మండల తహసీల్దార్‌గా సాయిలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మోస్రాలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన వర్నిలో అదనపు బాధ్యతలు చేపట్టారు. గత తహసీల్దార్ మోతీసింగ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేశారు. దీంతో ఆయన స్థానంలో సాయిలు బాధ్యతలు చేపట్టారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పిట్లం, ఏప్రిల్26: ప్రభుత్వం ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిషన్ అన్నారు. శుక్రవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏవో ప్రారంభించారు. రైతులు పండించిన జొన్నలు దళారులకు తక్కువ రేటుకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఏవో కోరారు.


జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	:రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,800	రూ.66,900	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 :రత్నం (11.30, 2.45, 6.00, 9.15)
:టిల్లు స్వ్కేర్ (4.30, 10.25)

స్ర్కీన్-2 :గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.25, 7.10)
:మంజుమ్మల్ బాయ్స్ (4.05)
:బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ)(10.05)

స్ర్కీన్-3 :మంజుమ్మల్ బాయ్స్ (1.00)
:టిల్లు స్వ్కేర్ (4.00, 10.35)
:ది ఫ్యామిలీ స్టార్ (7.10)

స్ర్కీన్-4 :ది ఫ్యామిలీ స్టార్ (1.10)
:కొంచెం హాట్‌కే (తెలుగు) (4.35)
మంజుమ్మల్ బాయ్స్ (7.15, 10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 :రత్నం (1.30, 4.30, 7.30,

స్ర్కీన్-2 :టిల్లు స్వ్కేర్ (1.40)
మంజుమ్మల్ బాయ్స్ (7.40),
కొంచెం హాట్‌కే (తెలుగు) (7.30),

దేవి :టిల్లు స్వ్కేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ :ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ :హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ :రత్నం (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్